# టెన్షన్

నాతోపాటు టీచర్‌గ పనిచేసి నా తరువాత నెలకు రిటైర్ అయి పక్క వూళ్ళో వుంటున్నాడు నారాయణ. ఇద్దరం రాజస్థాన్ టి స్టాల్ దగ్గర టి తాగుతు గతంలో వచ్చిన జీతానికి ఇప్పుడు వస్తున్న పెన్షన్ డబ్బులకు ఎక్కడా పోలిక లేకపోవడం వల్లా ఇబ్బందులను కాసేపు చర్చించుకుని నేను పెట్రోల్ బంక్‌వైపు, అతను మేన్ బజారువైపు మళ్ళితిమి. ఎదురుగావున్న పంపు దగ్గర్కి నెట్టుతువెళ్ళి బండి ఆపి, లీటర్ పెట్రోల్ అన్న. టాంకు మూత తిప్పగ దానికున్న రంధ్రంగుండా బయటకి చిమ్మిన ఆయిల్ కలిపిన పెట్రోల్ చిత్తడిగా మారి పొరలు పొరలుగా పేరి మురికి జిడ్డుగా తయారై వేళ్ళకు అంటుకుంది.

"సింగిల్ ఆయిలా డబులా" అడిగాడు బండివైపు చూస్తు.

డబుల్ ఆయిల్ అని మూత తీశాను.

ఈలోపు ఒక అతను ప్లాస్టిక్ కేన్‌తో నాముందుకొచ్చి నిలుచున్నాడు. అతని కేన్‌లో పోస్తువున్నడు. అక్కడే 'క్యూలో రండి' అని రాసి తగిలించిన అట్టముక్కను చూపించాను. పోసేవాడు, పోయించుకునేవాడు ఇద్దరు ఇగిలించారు. నాకు వల్లుమండింది. మండేవల్లు చల్లారడం కష్టంకదా. ఆ తరువాత నాబండివైపు మళ్ళి పావు అందుకుని దాని నిండా కేన్‌లోనుండి నింపుకొని బండి టాంక్‌లో పోసాడు.

ఏంపోసావు అని అడిగాను సీరియస్‌గా.

"ఆయిల్" అన్నాడు నాజిల్‌ను టాంకులో పెట్టి మీటర్‌నాక్‌ను నొక్కుతు.

నేను పెట్రోల్ పోయమన్నానె.

"డబుల్ ఆయిల్‌కూడ పోయమన్నరు" అన్నాడు పెట్రోల్ పోస్తు.

ఏది ముందు పోయాలో నీకు తెలుసా? అన్న.

"ఏదిపోస్తె ఏముంది? పోసినంక రెండు కలుపుకుంటయి" అన్నడు అతి మాములుగా ఇదో సమస్యా అన్నట్టు చూస్తు.

మొదలె ఆయిల్‌పోస్తె ఏమైద్దో తెలుసా, బండిని వున్నచోటునుండి ముందుకు నెట్టుతు అడిగాను.

'తెలవదన్నట్టు' చూస్తు ఓసారి బుజాలను పైకి అని వొదిలేసాడు. అప్పుడు అతని పెదాలు బిగుసుకుపోగ కాసేపు అట్లాగె అదిమివుంచి వొదిలేశాడు.

తెలియంది బంకులో ఎందుకు పనిచేస్తున్నవ్.

"బతకలేక" అన్నాడు నిష్ఠూరంగా చూస్తు.

ఏ పనిచేసినా ఆ పని గూర్చి అంతో ఇంతో తెలుసుకుని చేయాలి.

"పదేండ్లనుండి ఇదేపని చేస్తున్న సార్ " అతి మామూలుగా అన్నడు.

నేను సీరియస్‌గ చెపుతుంటే నీవు అట్లా మాట్లాడితివి .

నోజల్‌ను స్టాండులోపెట్టి పైసలకోసం చేయిచాపిండతను.

"ఇన్నేండ్ల నుండి ఈ బంకులోనే పనిచేస్తున్న ఎవ్వరు ఏమి అనలేదు. ఈయాల మీరు ఆయిల్ మొదటపోయొద్దు అంటున్నరు" అని నిర్లక్ష్యంగా చూసిండు.

మీ సేట్‌ను పిలువు చెపుత

"సేట్ ఇంత పొద్దున్నెరారు" అన్నడు.

అది విన్న క్యాషియర్ "ఏమిటి" అంటు వచ్చిండు.

"ఆయిల్ ముందె పోయగూడదంటున్నడు ఈన" అదో మాదిరిగా నావైపు చూస్తు.

"బండిలో పెట్రోల్ ఏమాత్రం లేదా?" అని అడిగిండు ఆ వచ్చినతను చిరునవ్వుతో

"నాకేం తెలుసు లీటర్ పోయమంటే పోసిన, పెద్ద తప్పు చేసినట్టు మాట్లాడుతుండీన" అని మరో బండివైపు మళ్ళిండు.

"తప్పేరబాబు ముందే ఆయిల్‌పోస్తే కార్బేటర్‌లో చిక్కని ఆయిల్ చేరి బండి తొందరగ స్టార్ట్ కాదు" అన్నడు.

అది అతనికి తెలియదురా. పైగ ఈన, ఈన అంటడు కున్నవెదవ."

"తెలిసేదేముంది" అంటు కాస్తంత గొంతు పెంచుతు "వెదవగిదవ అంటవు"

"మీరైన చెప్పొచ్చుకదసార్. ముందు పెట్రోల్‌పోయమని" అంటు నావైపు చూసిండు క్యాషియర్. 'అతని నోరుమూయి' అని సెగచేస్తు

నేనన్నదదే పెట్రోల్ పోయమని.

"నాకేమెరుక అందులో పెట్రోల్ వుందనుకున్న" అంటు వెనుకవున్న మరో బండిని మరికాస్త ముందుకుంచమని సైగచేస్తు.

నేను బండిమీదొచ్చిన్నా, నెట్టుకొచ్చిన్నా

"ఎవరు చూడబోయిండ్రు" అన్నడు పావులో ఆయిల్ నింపుతు.

"ఇకపోనియుండి సార్" అంటు పైసలకు చేయిసాపాడు క్యాషియర్.

అటుచూడు ఇంత చెప్పిన మళ్ళీ ముందే ఆయిల్ పట్టుకుంటువుండు.

మూడు పదిరూపాయల నోట్లు చేతిలోపెట్టి బర్లదగ్గరినుండి వచ్చి బంకుల్లో

జేరితె ఇంతేమరి అని గులుగుకుంటు బండి కిక్ కొట్టిన. అది స్టార్ట్‌కాలేదు. మళ్ళీ మళ్ళీ నాలుగు కిక్కుల తరువాతగాని స్టార్ట్ కాలేదు. అది సంగతి.

00

ఇంటివైపువెలుతున్న, బండి మామూలు స్పీడులోవుంది.

"సార్, సార్" అంటు నావైపు వేలు చూపించిండు, ఎందుకో, ఏమిటో అని అట్లాగె నడుపుతున్న.

కొంతదూరం రాగానే బండివైపు చేయినిచూపిస్తూ నాముఖంలోకి చూస్తు అదేసైగ 'పోనిలే' అనుకుంటువస్తూనేవున్న.

మరొక నడియస్సు వ్యక్తి ఎదురై"లైట్,లైట్" అని అరిచిండు. నేనువస్తూనే వున్న.

మరొక వ్యక్తి నా బండిని ఆపమని సైగచేస్తు అతను "లైటొస్తుంది సార్" అన్నడు.

ఎడ్ లైట్ వైపుచూస్తే అవును లైట్‌వస్తూ వుంది. బండిని స్లో చేస్తు స్విచ్ ఆప్ చేసిన. లైట్ వెలగడం లేదు. ఈ లోపు నన్ను ఆపినవ్యక్తి నా దగ్గరకొచ్చి" పట్టపగలే లైటేసుకొని పోతున్నరు" ఏసుకొనిపోతే ఎమైతది. పెట్రోల్ ఎక్కువ కాలుతదా, మీటర్ ఎక్కువ తిరుగతదా. ఏందో కొంపలుమునిగినట్టు చేస్తరేమయ.

"అరెబయి లైటోస్తుంది "పగలే లైటా"

అయితేందట

"నీ యిష్టంబయి పంచాయతి ఎందుకు"

పంచాయతి చేస్తున్నది నీవా నేనా.

"అరె ఇకపోనిబయి"

బయి ఏందిబయి. రాత్రిలైటేసుకొని తిరుగతం అట్లనే ఇంట్లో పెడతం. ఉదయం స్టార్ట్‌చేసుకొని రోడ్డుమీదికొస్తం. అంతె ఒక్కొక్కసారి ఆ లైట్ అట్లాగే వుంటది. దానికే గోల గోలా? బాపు రే బాపు!

"నీ యిష్టంబయి" అంటు కదిలిండు.

మళ్ళీబయి ఇగ ఏంచెప్పాలి!

బండి ఇంట్లోపెట్టి – నాస్తచేసి ఆటోఎక్కి బస్టాండు అన్న.

"పది రూపాయలు" అన్నడు ఆటోవాడు సిగరెట్ పొగను వదులుతు.

ఎనిమిది రూపాయలు అన్నను.

"నేనడిగింది ఎంత సార్ ఇంక రెండేనా" పెదాల మధ్య సిగరెట్‌ను అట్టాగె కరిచిపట్టుకుని పొగ అతని కళ్ళల్లో పొకుతువుంటె ఓ కన్ను మూసి మరోకన్ను తెరుస్తు అన్నడు.

విసిగించకు ఎనిమిదికి వస్తావా రావా? అన్న.

"మీరె విస్కిస్తుంద్రు. నేను అడిగింది రెండేకద ఎక్కువ?" అదే ఫోజులో

ఆ రెండైనా వుట్టిగొస్తావయ్యా.

"వుట్టిగొస్తె నేను ఆటో ఎందుకు నడుపుత. కూకో అన్నాడు. 'కూకో' అని అనక కూర్చోండి' అనలేదా? అదే అడిగిన.

'రెండూ ఒకటే కదా" అంటూ నావైపు చూసిండు.

నావైపు కాదు ముందుకు చూడు అన్న. వళ్ళు మండుతుంటె.

'బడిలో చదవరు భాషనేర్చుకోరు ఇక మాట్లాడటం ఎట్లా తెలుస్తుంది'.

నేను కూర్చున్న. అతను మునిసిపాలిటి వాళ్లను తిడుతువున్నాడు.

"ఈ రోడ్లకు ఎన్నడు మంచి రోజులొస్తయో. మీ లాంటోళ్ళు పట్టించుకోరు" పైసలు తీసుకోని ఓట్లేస్తె ఇంతేమరి అన్న.

"మనం అట్లాంటోల్లం కాస్సారు. ఆల్లు వేరేవుంటరు" నేనైతెకాను అన్నట్టు ఓసారి వెనక్కి తిరిగిచూశాడు. ఈలోపు బస్సు హారన్ విని ఆటోను పక్కకు తీసిండు. ఒక్కసారి అతలాకుతలం అయి పక్కరాడ్ను పట్టుకున్న. అంత ర్యాష్గ నడిపితె ఎట్లా అన్న.

"తొందరగా పోనీ అంటరు రాష్గ నడుపుతరు అంటరు ఎట్లా?" అన్నడు

ఎంతవరకు చదువుకున్నవ్?

"ఆటో నడపడానికి కూడ చదువుకోవాల్నా" అంటూ నావైపు ఓసారి చూసిండు.

అప్పుడు నాకు నవ్వొచ్చింది కాని ఆపుకున్న.

బస్టాండు రాగానే ఆటోను ఆపి నావైపు చూసిండు. పదిరూపయలనోటు ఇచ్చిన.

"రెండు రూపాయల చిల్లరలేవు" అన్నడు.

నన్నేం చేయమంటవు. ఎక్కడన్న తీసుకరా అన్న.

"సిగరెటేమన్న తేవాల్నా" అనగానే 'ఎవరికి' అన్నట్టు చూసినా

"మీకే" అన్నడు నవ్వుతు.

నేను సిగరెట్ తాగెటోనిలా కనపడుతున్ననా.

"అబ్బేలేదు" అంటు నాలుక్కరుచుకున్నడు.

"మీరిక్కడ ఉండండ్రి" అంటు అక్కడినుండి కదిలి చుట్టూ తిరిగొచ్చి "ఎవరూ ఇవ్వటంలేదు" అన్నడు నోటు చేతిలో పట్టుకుని.

ఇవ్వరు, ఎవరు ఇవ్వరు. ఇకనీవే వుంచుకో ఏంచేస్త అంటు అక్కడినుండి కదిలిన.

ఆటోవాడు ముసిముసిగ నవ్వుతు 'మంచిగడిగితె ఎందుకిస్తరు' అనుకుంటున్నట్టుంది అతని ముఖంలో కోపం నవ్వు కలిసి కదిలినయి ఎండ ముసురు కలిసొచ్చినట్టు.

బస్టాండంతా జనమేజనం. ఎవడో జేబు కొట్టేసిండంట వాన్ని పట్టుకుని వకటె కొట్టుడు. జనం మధ్యన వాడు కనిపించడం లేదు. కాని వాన్ని కొట్టే

చేతుల కదలికలు కనిపిస్తున్నాయి. 'చస్తి, చస్తి' అనె మాటలూ వినిపిస్తున్నయి.

నేను వెళ్ళవలసిన సూర్యాపేట బస్సు అప్పుడే కదులుతువుంది. పరుగులాంటి నడకతో వెళ్ళి బస్సునాపి ఎక్కిన. ఆ బస్సు నిండా జనమే. అడుగుతీసి అడుగు పెట్టలేని జనం. ముందు భాగంలో మూటలు, మల్లెలు. ఎట్లాగో అట్లా లోపలికి చేరి పైప్‌ను అందుకున్న. ముందు భాగంలో స్త్రీల సీట్లుకదా పూర్తి సీట్లు నిండి ఇంకొందరు నిలుచున్నరు. లోపలికి పోత అంటె ఎవ్వరు జరగడం లేదు. నా వెనకాలే మరో ఇద్దరు ఆడవాళ్ళు ఎక్కిండ్రు. వాళ్ల మధ్యన ఇరికిపోయిన. మనం తాకితె గుర్రుగ చూస్తరు. వాళ్ళు తాకితె మనం ఏం అనంకదా అప్పుడు ఇంక వాళ్ళు ఎటో చూస్తున్నట్టు చూస్తు ఈజీగా తీసుకుంటరు. ఎవరు ఎవర్ని కావాలని తగలరు, పరిస్థితి అట్లావుంటుంది.

అపరిచిత అపోజిట్ శరీరాలకు ఆకర్షణ ఎక్కువ ఎందుకో? వయస్సు పట్టింపు వుండనట్టుంది. కదిలినప్పుడల్లా ఇబ్బందిగా వుంది.

"టికెట్, టికెట్" అంటు కండక్టర్ అందర్ని నెట్టుకుంటు వచ్చిండు. అప్పుడే ఎటోచూసుకుంటు ఒకావిడ నామీదికి వరిగింది. అప్పుడు అందరు మావైపు చూస్తుండ్రు. ఏమనుకుందో ఏమో నావైపు మళ్ళి "కండ్లు కనబడుతలేవు" అని గుడ్లురిమింది. అంతకు ముందునుండే ఎవరు చూడనపుడు తనే తాకుతు వచ్చింది.

ఎవరికండి, కండక్టరుకా, నాకా, మీకా. మీరు నామీద పడి కళ్ళు కనబడుతలేవు అంటె నేనేం చెప్పేది. అని పైన రాడ్‌ను పట్టుకున్నచేయిని మార్చుకుని, షర్ట్‌ను సరిచేసుకున్నాను. షర్ట్‌పైభాగం మల్లెల వాసన. జేబులో ఒకటిరెండు మల్లెలు రాలడం అది వేరేవిషయం.

అప్పటినుండి పెదాలాడిస్తు ఏమేమో అంటున్న ఆమె ముఖంలోకి చూసి "మేడం రద్ది ప్రయాణం మనుషులకు మనుషులు తగలడం మామూలె పోనీయండి" అన్నాడు కండక్టర్. ఆమె కోపంగా చూస్తువుంది. 'నేనేం చేయలేను' అన్నట్టు చూస్తు కండక్టర్ కదులుతూ "టికెట్ టికెట్" అంటవుండు.

"అందరు ముందుటె నిలుచోక వెనక్కు జరుగొచ్చు కదా" అనంగనె "వొచ్చే ఊరిలోనే దిగేది" అంది ఒకావిడ. ఆమె పసిబిడ్డను సంకలో ఎత్తుకుని నానా అవస్త పడుతూవుంది. 'ఆమెకు ఎవరన్న సీటిస్తె బాగుండు కాని ఎవరు లేవటం లేదు. స్త్రీలను గౌరవించాలని ఎదురుగా రాసివుంది. కాని ఎవరు పట్టించుకుంటరు. కూర్చున్నవారిలో చాలామంది యువతులున్నరు. వాళ్ళలో ఎవరో ఒకరు లేసి ఆ పిల్లతల్లికి సీటు ఇవ్వొచ్చుకదా అట్లా ఇవ్వరు, అంతే అనుకుంటు ఎవరికి తగలకుండా బిక్కసచ్చి నిలుచున్న. కండక్టర్ పక్కసీటులో ఓ యువకుడు కూర్చున్నడు. అతను లేచి పెద్దవాన్నైన నాకు సీటు ఇవ్వొచ్చుకదా? ఇవ్వరంతె. పెద్దలను గౌరవించవలెను అని స్కూల్లో విని అక్కడే వదిలేస్తరు. ఇది మనవాళ్ళ

చదువు, అనుకుంటున్నప్పుడె కండక్టర్ "టికెట్" అంటు చేయి చాపిండు.

సూర్యాపేట అన్న వంద రూపాయలనోటు ఇస్తు.

"ఎన్ని" అన్నాడు కండక్టర్.

కనపడతలేదా ఒక్కన్నే అన్న.

"అయ్యో కోపమెందుకు సార్" జేస్‌టోన్‌తో అని టికెట్ పంచ్‌చేస్తు "రూపాయి చేంజ్ వుందా సార్" అని అడిగిండు

'ఎందుకు' అన్నట్టు చూసిన

"రూపాయి ఇస్తె ఎనభై ఇస్త."

లేవు అన్న

వెనుక ద్యూ రాసి ఇచ్చిండు. అది చూడగా ఎనభై ఒకటి అని రాసివుంది.

ఎనిమిది పదులు ఇచ్చి ఒకరూపాయి ద్యూ రాయొచ్చుగా అన్న.

"ఒకటి రాసినా ఎనభై ఒకటి రాసినా ఎట్లాగో రాయాలేగ" అన్నడు కండక్టర్.

'ఒకటిరాస్తె వున్నా ఓటె పోయినా ఓటె కాని ఎనభై మీరుమరవచ్చు నేనైనమరవచ్చు. ఎందుకైన మంచిది ఎనభైఇచ్చి ఒకటి రాస్తెపాయె అని మెల్లగ గునిగిన.

"సార్ మీరు మరిచినా మేం గుర్తుంచుకుని ఇస్తాంగ. నమ్మకం ముందాలి సార్" చేదు మందుకు తీపిని పూసినట్టు సీరియస్ మాటలకు నవ్వును అద్ది అంటు కదిలిండు.

మీమీద నమ్మకం లేకకాదు నామీద నాకె నమ్మకం లేక అన్న.

బస్సు నడుస్తూనెవుంది. ఎన్నో చిత్రాలు విచిత్రాలు. ఎక్కేవాళ్ళు ఎక్కుతూనే వున్నరు, దిగేవాళ్ళు దిగుతున్నరు. ఈ లోపు నేను ముందు భాగంనుండి మధ్య భాగానికి జరిగిన. అక్కడ ముందు వెనక ఒత్తిడిని తట్టుకోలేక కొంచెం జరుగుతార సర్దుకుందాం అన్నను. మూడవవాడు ఏం అనలేదు కాని 'అమాయకుడా ఇది ముగ్గురిసీటని తెలియదా' అన్నట్టు చూసిండు. అది సరిపోయింది నాకు. రెండవ వైపు మళ్ళాను కాని అడుగలేదు. అది ఇద్దరి సీటని తెలుసు కదా ఇద్దరున్నరు ఇంకా అడిగేది ఎందుకు అనుకున్న. ఈ లోపు మరో కుర్రోడొచ్చి వాళ్ళను కొంచెం నెట్టి కూర్చున్నడు. వాళ్ళేమి అనలేదు. గంట తరువాత బస్ పాత బస్టాండు దగ్గర ఆగింది "పాత బస్టాండ్" అని కండక్టర్ అనగానే నేను దిగాను. ఎదురుగ రిక్షా వుంది వెళ్ళి రిక్షాలో కూర్చొని వాటర్ ట్యాంక్ అన్నాను.

'పోదాం' అన్నట్టు చూశాడు.

అచ్చా, అట్లయితె కాస్త ఎక్కువ డబ్బులిచ్చేవాడైతె బాగుండేది అన్నాను.

"మీరైతె ఇవ్వరా" అంటు నావైపు చూసిండు.

సంపాదించేవాడు ఓ రూపాయి ఎక్కువ ఇవ్వటానికి వెనకాడడు అన్న.

"మరి మీరు" అన్నడు. నేను మాట్లాడలేదు.

"ఈ రోజు 'జయం' సినిమాకు పోవాలె" అన్నడు మళ్ళీ తానె.

అంతబాగుందా దానికే పోవడానికి అన్న.

"సినిమా పోని అందులో ఓ మాంచి పాటవున్నది. ఆ పాటకోసం" అన్నడు ఎంతో ఆసక్తిగా రిక్షాను హుశారుగా తొక్కుతు.

"అది పాటంటె పాటకాదు. మీరు ఇప్పటివరకు విననిది. అదె రాను రాను అంటూనే చిన్నది, చిన్నది రాములోరి గుడికొచ్చే చిన్నదో చిన్నది"

అని పాడుతు మధ్య మధ్య ఈల పాటతో మ్యూజిక్.

సామాన్యుడు ఎంత సరదాగా వుండో అనుకుంటువున్న. ఇంతలో వాటర్ ట్యాంకు రాగానే రిక్షా ఆపాడు.

ఆ రైట్‌కు మళ్ళి మూడో ఇంటి గేటు ముందాపు అన్న.

"వాటర్ ట్యాంక్ అంటిరిగద" దిగి షర్ట్ ముందుభాగంతో నొదురు అద్దుకుంటు.

ఏదో గుర్తుకోసం అట్లాచెపుతం. వాటర్ ట్యాంకు అంటె వాటర్‌ట్యాంక్‌లోపలికి పోతామయ అన్న.

"ఏమో మీరన్నది నేను అంటున్న" అన్నడు. సీరియస్‌గ ముఖంపెడుతు.

ఎందుకయ్యా మొత్తుకుంటవ్ ఇప్పుడు ఏంబోయిందని, ఆ రైట్‌కు మలుపు, గులుక్కుంటు అన్న. రిక్షా మలిపిండు. రోడ్డు డౌను వుంది కనుక రిక్షా కాలుఎయ్యగానే మూడవ గేటు ముందాగింది. ఎంతియ్యాలి అన్న.

"ఇవ్వండి ఓ పదియేను రూపాయలు" అన్నడు.

ఏంటి పదియేను రూపాయలా గీనించి గీడికి పదియేను రూపాయలా? రూపాయలేమన్న చెట్లకు కాసే కాయలా తెంపియ్యడానికి అన్న.

"కాయలైతే నేనె తెంపుకునేటోన్ని, కావు కాబట్టే అడుగుతున్న . అదిగూడ కష్టంచేసి, చెమటోడ్చి అడుగుతున్న" అంటు రిక్షాసీటు చేత్తో కొడుతూ వాదనకు దిగిండు.

ఐదు రూపాయలు తీసుకో అంటు జేబులో చేయిపెట్టిన. బస్ టికెట్ తగిలింది. దానిని చూడగానే దానిమీద రాసున్న ఎనబైఒకటి 'డ్యూ' కనిపించింది. వెంటనే కొత్తబస్టాండుకు పోనీ అంటూ రిక్షా ఎక్కబోయిన.

"ఆగండి ఎక్కుదురుగాని ముందు పైసలివ్వండి ఆ తరువాత చూద్దాం" అన్నడు ముఖం మాడ్చుకుంటూ.

కండక్టర్ ఎనబై ఒక్క రూపాయలివ్వాలి 'చూడు అని టికెట్ వెనక రాసింది' చూపించిన.

"ముందీపైసలివ్వండి. మల్ల అక్కడ కిరికిరి చేస్తరు" అన్నడు.

ఏమిటి నేను కిరికిరి చేస్తనా. నన్నేమనుకుంటున్నావ్ అన్న.

"మీరేమైతె నాకేందిసార్. ముందు నా పైసలివ్వండ్రి" అన్నడు

అరె, అన్ని కలిపి ఒక్కసారె యిస్త పదవయ్య బస్సు మళ్ల నల్లగొండ పోతది అన్న.

"బస్సులు పోకుంటె వుంటయాసార్, దిగెటప్పుడె అడుక్కోవచ్చుగ. పైసలంటే మీకు లెక్కలేనట్టుంది. కాని రిక్షా కిరాయి దగ్గరె కిరికిరి చేస్తరు."

వాడు కిరికిరి అన్నప్పుడల్లా నాకు బాధనిపిస్తుంది. కాని చేసేదిలేక పదపద అన్న. రిక్షా ఎక్కి కూర్చుంటు.

"సార్ మొదలె చెపుతున్న అక్కడికి పదియేను అవుతయి. పదియేను ఇస్త అంటె వస్త. లేదా నా కిరాయి నాకిచ్చి వేరే రిక్షా చూసుకో" అన్నడు.

మరో రిక్ష దొరకడానికి ఎంతసేపు పడుతుందో పదియేను ఇవ్వాలిగ సరేపా అన్న. రిక్షా కదిలి మెల్లగా నడుస్తువుంది.

కాస్త తొందరగా పోనీ అన్న బస్సు ఎళ్ళిపోతదేమో అన్న ఆతురతతో. వల్లంత చెమట పడుతుంది. ఒట్టి మతిమరుపుతో ఎనభై రూపాయలు పాయె. రిటైర్డ్ అయినాక జ్ఞాపకశక్తి సన్నగిల్లుతదన్న విషయం నిజమేనట్టుంది అనుకున్న. రోడ్డంత జనం ఎవరిని ఎవరు పట్టించుకోకుండా నడుస్తున్నరు. అక్కడక్కడ స్పీడు బ్రేకర్లు. అడ్డంవచ్చె మనుషులు మధ్య మధ్య రిక్షా బ్రేకులు వేసుకుంటు, నొదులుకుంటు నడుపుతున్నడు.

పోనియ్యిబాబు, బస్సెల్లిపోతుంది. పైసలు పోతయి అన్న.

"నన్నేం చేయమంటరు సారు మనుషులు రోడ్డుమీద మనుషుల్లాగ నడుస్తాంద్రా చూస్తనేవున్నరుగద. మల్ల చదువుకున్నోల్లట. ఏం చదువుతరో ఎట్ల చదువుతరో. మనుషులకు, గొర్లకు తేడాలేదు. తలకాయ వంచుకొని గొర్లు పోయినట్టు పోవడమేనా? వెనకొచ్చేటోన్ని ముందు వస్తున్నోన్ని చూసేది లేదా. ఆల్లు చూడండి ముగ్గురు గొలుసుకట్టుగ నడుస్తున్నారు." అంటు గంట కొట్టాడు. గంట చప్పుడు వింటూ కూడా అట్లాగె నడుస్తువున్నరు కాని కాస్తన్న కదలటంలేదు. ఒక్కరన్న పక్కకు జరగరు అని విసుకున్నడు.

"ఇట్ల అడ్డగోలిగా నడుస్తరు. జెర్ర రిక్ష తగిలితె ఇకచూడు వాని సంగతి" అంటు తన అక్కసును ఎల్లపోసుకుంటున్నడు.

ఎట్లయితే ఏం కొత్త బస్టాండ్ చేరినం. కొట్టంలో కట్టేసిన గుర్రాల్లా వరుసగా బస్సులు నిలబడి వున్నా నేనొచ్చిన బస్సును గుర్తించి అదయ్య నేనొచ్చిన బస్సు అని బస్సు వైపు మల్లిన.

"సార్ నాకిరాయి ఇచ్చిపోండ్రి" అన్నడు నా వెనకాల్నే వస్తు.

ఆగవయ్య మల్లి వాటర్‌ట్యాంకు దగ్గర దింపుదువు కాని అన్న.

బస్సు దగ్గరికి నడిచిన బస్సు వెనకబోర్డు మారలేదు. ముందుకెళ్ళి చూసిన ముందుబోర్డును మార్చిండ్రు 'నల్లగొండ' అని వుంది. ఇదె బస్సు, లోపలికి తొంగి చూసిన. ప్రయాణికులు తప్ప కండక్టర్ లేడు, డ్రైవర్ లేడు, ఎటుఎల్లినట్టు, చుట్టూ చూసిన. పండ్ల దుకాణం దగ్గర వేరేవాళ్ళు కొందరు పండ్లు కొనుక్కుంటువున్నరు.

మరికొందరు బేరమాడుతున్నరు. పాన్‌షాప్ వైపు చూసిన వేరే వాళ్ళు పాన్ సిగరెట్స్ కొనుక్కుంటున్నరు. కొందరు కొన్న సిగరెట్లను అంటించుకుంటున్నరు. కంట్రోలర్ రూంవైపు చూసిన. అక్కడ కనిపించిండ్రు ఖాకి యూనిఫాముల్లో ఇద్దరు.

" నా పైసలు నాకియ్యండి నేను పోతా. సినిమా టైమ్ అయింది" అని పిలుస్తున్నడు.

ఆగు ఆగు వస్తున్న అనిచేత్తో సైగచేస్తు కంట్రోలర్ క్యాబిన్ దగ్గరికివెళ్ళి చూద్దును కదా నల్లగొండ బస్సువాళ్ళు కాదు. అరె వీళ్ళు ఎక్కడెళ్ళొచ్చు అని చుట్టూ చూస్తువున్న. కాంటిన్ నుండి రెండు శాల్తీలు ఖాకి డ్రస్సులో వస్తున్నరు, ఎదురెళ్ళి నిలిచున్న.

డ్రైవర్ సిగరెట్ దమ్ము లాగుతున్నడు. కండక్టరు సోంపును నములుతున్నడు.

ఎదురుగ టికెట్ చేతపట్టుకొని నిలుచున్న. దగ్గరికి రాగానే టికెట్ చూపించిన, దానిని పామును చూసినట్టు చూసి "పిలుస్తువుంటెవెళ్ళి రిక్షాలో కూర్చున్నరు సార్" అన్నడు నావైపు చూడకుండా కంట్రోలర్‌వైపు చూస్తు,

'అంటె నేను రిక్షాలో కూర్చున్నది కూడ చూశాడన్నమాట' మరి ఎందుకు పిలువలేదు? అన్న.

"నేను మరిచిపోయాను సార్" అంటు టికెట్ చింపేసిండు.

'అంటె డబ్బులు ఇవ్వడా' అనుకొని డబ్బులు అన్న.

"ఇస్తాను సారు కాస్త ఓపికపట్టండి. బస్సెల్లిపోతె ఏంచేద్దురు" అంటు అదోమాదిరిగ చూస్తు సంక సంచిలో చేయిపెట్టి నోట్లను వేరుచేస్తున్నట్టుంది.

ఏం చేస్తం నెత్తికొట్టుకుంట అని 'ఏంచేస్తం ఊర్కుంటం లేదా డిపో మేనేజర్‌కు రాసి తెప్పించుకుంటం' అనుకుంటు అతను పది రూపాయల నోట్లను లెక్కపెడుతుంటె నేను లెక్కపెట్టి ఇవ్వగానే జేబులో పెట్టుకున్న అమ్మయ్య అనుకుంటు.

"లెక్కపెట్టుకోండి సార్. మొదలె మీకు తొందర ఎక్కువ" అన్నడు.

ఆమాట అనగానె కోపం ముంచుకొచ్చింది. కాని ఓపిక పట్టిన.

"సార్ తొమ్మిది రూపాయలుంటె ఇవ్వండి పదిస్తాను. నా దగ్గర ఒక్క రూపాయి ఛేంజ్ లేదు. ఇందాకనే క్యాంటిన్‌లో ఇచ్చాను." అన్నడు 'క్యాంటిన్ల మీకు పుణ్యానికేనాయె' అనుకొని చిల్లరవుంటె అప్పుడే ఇచ్చేవాన్నిగా అన్న.

"మరి రూపాయి లేదు" అన్నడు.

'ఉండనీ' అన్నట్టుగ తలాడించిన. 'సరె' అన్నట్టుగ కండక్టర్ చూసిండు.

నేను వెనక్కుమళ్ళిన నక్షత్రకుడిలాగ నా వెనకనే రిక్షోడు.

"సార్ సినిమాకు పోవాలని చెప్పిన్నా, నా పైసలు నా చేతిలో వేయండి పోత" అన్నడు అప్పుడతని ముఖం మళ్ళి చికాకుగా మారింది.

ఇస్తానయ్యా ఇస్తాను నీవు ఎటువెళ్ళాలి అని అడిగిన.

"మనం వచ్చినకాయె కాని అడ్డరోడ్డున సందు మల్లాలి" అన్నడు.

నేను అటేగా వచ్చేది పద పోదాం అని రిక్షాలో కూర్చున్న.

"ఏం తిరుగుడో ఈ తిరుగుడు మళ్ళీ పదియేను అవుతయి" అన్నడు.

నేను నవ్వి నీ రిక్ష ఎటుతిరిగిన పదియేను ఫిక్సడన్న మాట. ఆటోలో వెలితె పది రూపాయలే గదా అన్న.

"అయితే అండ్లనే పోవల్సింది. మరి రిక్షా ఎందుకెక్కిండ్రుసారు" అన్నడు వెనక్కిమళ్ళి ఓ మాదిరి ఈసడింపుగా చూస్తు

ఈ లోపు ఇద్దరు ఆడవాళ్లొచ్చి రిక్షా పక్కన నిలుచోని నవ్వుతు వున్నరు. కులుకుతు చేత్తో గడ్డాన్ని తాకుతు " శృంగార పురుషుడు. వయసులో వున్నప్పుడు ఎందర్ని పట్టిండో బావ" అంది ఒకామే.

"ఇప్పుడు మాత్రం వదులుతడా మీసాలు తెల్లగైనయిగాని ఎట్లుండు చూడు గట్టిగా చింతగింజోలే" అంది రెండవ ఆవిడ.

చుట్టూ చూసిన అందరు మా వైపు చూస్తువున్నరు 'రిక్షావాడు నవ్వుతు నిలుచున్నడు'.

ఏం కావాలని అడిగిన

వాళ్ళు నీవే కావలన్నరు మొదట. ఆ తరువాత "నీకు వీలైనంత" అన్నరు.

అప్పుడర్థమైంది వాళ్ళిద్దరు కొజ్జలని.

పోనియిపోనీ, నువ్వు సినిమాకు పోవా అన్న.

రిక్షావాడు వాళ్ళను తప్పించుకొని ముందుకు సాగిండు. ఏమి ఇవ్వనందుకు వాళ్ళు ఏదో తిడుతున్నట్టుంది. కోపంగా చూస్తు పెదవులను ఆడిస్తూ, చేతులను జాడిస్తువున్నరు.

"ఏం సార్ వాళ్ళు అంతగనం అడిగితె ఏమి ఇవ్వరైతిరి" అన్నడు.

నీవెందుకు ఇవ్వలేదు అన్న.

"వాళ్ళు నన్ను అడుగలేదుగ. ఎవర్ని అడగాల్నో వాళ్ళకు తెలుసు" అన్నడు నవ్వుముఖంతో.

నా దగ్గరేముంది

"ఉన్నయని అడిగిండ్రు. కండక్టర్ ఇస్తుంటె చూసిరిగద" అంటు పైడిల్ మీద కాలుంచి ఒక్క పిర్రమీద కూర్చున్నడు. అక్కడ రోడ్డు డౌనుకుంది రిక్షా తొక్కకున్నపోతుంది. పోయెటపుడు మరో రోడ్డున తీసుకెళ్ళిండు. ఆ వైపునుండి ట్రాఫిక్ కాస్త తక్కువగావుంది. రిక్షా వేగంగా పోతువుంది. అది కుటుంబాలుండే కాలనీ. దీపాలు పెట్టెవేళ్ళ ఆడవాళ్ళు బయట మెట్లమీద కూర్చొని బాతకాని కొడుతున్నరు. సందుల్లో యువకులు సిగరెట్లు పీలుస్తున్నరు. వాటర్ట్యాంక్

ముందటి మూడవగేటు ముందాగింది రిక్షా. అంతకుముందు అటువైపు నుండి వచ్చి ఆగింది కనుక రిక్షా వానికి తెలుసు.

రిక్షావాడు చేయిచాపిండు 'తే' అన్నట్టుగ.

నేను జేబులో చేయివుంచుతు ఎన్ని అన్న.

"మూడు పదియేనులు"అన్నడు.

"నమస్కారం సార్" అంటు స్కూటర్ ఆపి స్టాండు వేసి నావైపు నడుస్తు "నేను రశీదును. టెన్త్‌లో మీ శిష్యున్ని. ఇప్పుడు ఈ ఏరియా హెడ్ కానిస్టేబుల్‌ని" అంటు నేను కిరాయి యిచ్చేది చూసి "నేను ఇస్తాను లెండి సార్" అన్నడు జేబులో చేయివుంచుతు.

అబ్బా నీకెందుకయ్య మీటర్. అంటూ నవ్వుతూ నిలుచున్న.

'నేనిస్తాగా మీరాగండి' అంటు సైగచేశాడు.

"ఎంతర" అన్నాడు హెడ్.

ఎక్కడినుండి ఎక్కడ తిరిగింది చెప్పాడు.

"దబ్బులెన్నో చెప్పరా"

"మీకు తెలవదాసార్ ఇవ్వండి" అన్నట్టుంది వాలకం

"ఇందా" అంటు అతని ఓ పదిహేను చేతిలో పెట్టాడు. రిక్షావాడు ఏం మాట్లాడకుండా రిక్షాను నెట్టుకుంటూ నడిచాడు. నేను నవ్వుకుంటు గేటును నెట్టాను. రశీదు నాకో సెల్యూట్ కొట్టి "వస్తా సార్"

అంటు స్కూటర్ స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయిండు.

వాస్తవంగా ఎంత ఇవ్వాలో అంత ఇచ్చిండు. సరిపోయింది అది సంగతి.

వరండాలో లైట్ వెలుగుతుంది. మనుషుల కదలిక లేదు. వస్తున్నాను అని ఫోన్ చేశానే అనుకుంటునప్పుడు అప్పటి వరకు ఇంటిమూలన నిలుచున్న వాచ్‌మెన్ వచ్చి –

"నమస్తె అయ్యా. ఇంట్లో అందరు సినిమాకు పోయింద్రయ్య" అంటూ గేటు తెరిచాడు. లోపలికి వచ్చి వరండాలోని కుర్చిలో కూర్చుంటు వస్తానని ఫోన్ చేసిన్నే అన్న.

"తెలవదయ్య నాకేం చెప్పలేదు" కదుపులో ఆకలి కదిలినట్లనిపించింది.

ఓ పనిచేయి దగ్గర్లో ఏమన్న కార దొరుకుతుందా అని అడిగిన.

"దొరుకుతుంది" అన్నడు.

ఓ పది రూపాయల నోటిచ్చి పట్టుకరాపో అన్న.

"సరె అయ్య" అంటు కదిలిండు.

బాగా ఆకలిగా వుంది. ఆ తెచ్చేన వస్తువును బుజాన వున్న కండువా సాటున పెట్టుకొని అటు ఇటు చూస్తూ నిలుచున్నడు.

దుకాణంలో తెస్తివా? బయట బండ్లమీద తెస్తివా అని అడిగిన.

"ఇప్పుడు దుకాణలెక్కడివయ్యా. గీ గుడిసెల్లో లంబడోల్లు అమ్ముతుంటె ఆల్ల దగ్గర తెచ్చిన" అన్నడు.

నాకేమి అర్ధంకాలేదు. ఏది ఇటుతె అన్న.

బావికి వలలేసి పట్టిన వూరపిచ్చుకను బుట్టలోకి మార్చినట్టు అతను టవల్ కిందనుండి మెల్లగ ఓ పావు సీసాను తీసి నాకు ఇవ్వబోయిండు. తికమకగా చూస్తు.

అదేమిటి అని చూసిన.

"అయ్యా తమరే సార తెమ్మన్నరుగదయ్యా" అన్నడు.

ఇక నా మతి పోయినట్లై చూస్తు నిలుచున్న. ఆ తరువాత తేరుకొని ఇక్కడికి దగ్గర్లో డాక్టరుగారున్నరా. అడిగిన

"ఆ రెండవ సందులో వున్నారయ్యా" అంటు సారా సీసాను మళ్ళీ టవల్ చాటుకు పెట్టుకున్నడు.

నేను డాక్టర్ దగ్గరికి వెళ్లొస్తా, ఆ తెచ్చింది నీవే తాగు. నేను కార తెమ్మంటే నీవు సార తెస్తివా అంటూ నేను రెండవ సందువైపు నడుస్తువున్న.

రిక్షాలో వొచ్చేటప్పుడు జరిగిన మరో సంఘటన గుర్తొచ్చింది.

ఆపవయ్యా రిక్షా అన్న.

'ఎందుకు తండ్రి' అన్నట్టు చూస్తు బ్రేకు వేసిండు.

పిల్లలకు కాసిన్ని ద్రాక్షపండ్లు తీసుకుందాం అని రిక్షాదిగి బండి దగ్గర్కి నడిచి, పండ్లను పట్టిచూస్తు, ఎట్లా కిలో అన్న.

"నల్ల ద్రాక్ష కిలో నలభై" అన్నది బండామె.

చూడు ఇచ్చే ధర చెప్పు అన్న.

ఆమె మాట్లాడలేదు.

'అమ్మదలుచుకోలేదా' అన్నట్టు చూసిన. "కొనెటొల్లకు ఎందుకమ్మం" అంది. ఇరవై కిస్తవా అన్న

'ఎన్నడన్న కొన్న ముఖమేనా" చిన్నగా పండ్లను బండిమీద సర్దుకుంటు. నాకు వినపడుతదా అనుకున్నట్టుంది. ఆ మాట వినగానే నాకు కోపం వచ్చింది. ఆడ మనిషిని ఏం అంటం.

ముప్పయికి కిలో ఇస్తవా అన్న.

'రావన్నట్టు చూస్తు పక్కకు మళ్లి తుపుక్కున ఊంచింది. నాకు చివుక్కు మనిపించింది. కాని ఆమె నేను అట్లా అడిగినందుకు ఊంచిందా? అంత మస్తా? బేరం చేసుకునేదానికి అంత ఉండగూడదే? అమె నోరు ఎర్రగా వుంది. దానికితోడు ఓ చిన్న డబ్బాతీసి దాని మూత తీసి చిటికెడు జర్దా కావొచ్చు నోట్లో వేసుకుంది.

ఇక ఉమ్మురాక ఏమొస్తది. ఈ లోపు మరొకసారి ఊంచింది. అప్పుడనిపించింది ఆమెకు అది మామూలేనని. అట్లా ఆమె పొద్దస్తమానం ఊంచడం వల్ల అక్కడ భూమంతా ఎర్రమట్టి చల్లినట్టుంది.

"ఏమయ్యి కొనడానికొస్తివా, పండ్లను పరిక్షిస్తందుకొస్తివా" అంటు ఈగల్ని చేత్తో లేవగొట్టింది. అప్పుడెందుకో నన్నే ఈగలా చూసినట్టనిపించింది.

జోకు ఓ అరకిలో అన్న ఓ మంచి గుత్తిని ఏరి ఆమెకిస్తు-

"మీరు ఏరొద్దు నేను మంచియె ఇస్తగా" అంటు తరాజు పట్టుకుంది.

నేను సరే అని సర్దుకుని నిలుచున్న.

ఆమె ఎడమ చేత్తో తరాజును పట్టుకుంది, కుడిచేత్తో ఓ శాబాది బండ ముక్కను తరాజులో వుంచింది.

అరకిలో బాటులేదా? అన్న.

'ఇప్పుడు ఏమైంది' అన్నట్టు చూసింది.

అసలుబాటు ఎయి' అన్న.

"నీకు ఒక్కనికే ఇస్తలేను. అందర్కి దీంతోనే ఇస్తున్న" అంది మరోసారి తపుక్కున ఊంచుతు.

నాకెందుకో వళ్ళు మండింది.

ఈలోపు డాక్టరున్న సందు వచ్చింది. కొంచెం ముందుకు నడిచినంక డాక్టర్ క్లినిక్ గేటు, ఆ గేటు లోపలికి నడిచి విజిటర్స్ హాళ్ళో కూర్చున్న. క్లినిక్ బోయ్ వచ్చి పేరడిగిండు.

నారాయణ అన్న

ఒక్కొక్కరె పోయి వస్తున్నరు.నా వంతు రాగానే నన్ను లోపలికి పంపిండు అక్కడున్న బోయ్.

నన్ను చూడంగనే డాక్టర్ 'కూర్చోండి' అంటు బి.పి. మిషన్ బెల్ట్ నా దండరెట్టకు చుట్టి, బి.పి. చూస్తు "ఇంత బి.పి. ఎందుకొచ్చింది." అని అడిగిండు అంతేగాదు "టెన్షన్ పడుతున్నట్టుంది" అంటు రెక్కకున్న బెల్ట్‌ను విప్పాడు.

నేను తల పట్టుకుని ఏం మాట్లాడలేదు.

మీకు తెలుసుగా నాకు ఇంత బి.పి. ఎందుకు పెరిగిందో!

• 2002